ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

తెలుగు దిన పత్రిక

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :210 సోమవారం మే 25 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## పొలాల్లో ఎగురుతున్న సాంకేతిక విప్లవం



**●వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం..**

**రైతులకు కొత్త దారి**

**●మందు పిచికారీ నుంచి పంట పర్యవేక్షణ వరకు విస్తరిస్తున్న సేవలు**

మే 24 (మనప్రజాప్రతినిధి): భారత వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవం వేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు సినిమాల్లో మాత్రమే కనిపించిన డ్రోన్లు ఇప్పుడు రైతు పొలాల్లో ఎగురుతున్నాయి. పంటలపై మందు పిచికారీ, ఎరువుల పంపిణీ, పంట ఆరోగ్య పరిశీలన, నీటి వినియోగ అంచనా వంటి పనుల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. శ్రమ, సమయం తగ్గడంతో పాటు ఖర్చులు కూడా తగ్గుతుండటంతో రైతులు ఈ కొత్త సాంకేతికత వైపు ఆకర్షితులవుతున్నారు. ముఖ్యంగా కార్మికుల కొరత పెరుగుతున్న సమయంలో డ్రోన్లు రైతులకు పెద్ద సహాయంగా మారుతున్నాయి. దేశంలో వ్యవసాయ డ్రోన్ల వినియోగానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాలు, వ్యవసాయ సంస్థలకు సబ్సిడీలు ప్రకటిస్తూ డ్రోన్ల కొనుగోలుకు ప్రోత్సహిస్తున్నాయి. “డ్రోన్ దీదీలు” పేరుతో గ్రామీణ మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వ్యవసాయ సేవల్లో భాగస్వామ్యం చేస్తున్నారు. డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేస్తూ మహిళలు కూడా ఆదాయం పొందుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. సాంకేతికత గ్రామీణ ప్రాంతాలకు చేరుకోవడంతో వ్యవసాయం కొత్త దిశగా అడుగులు వేస్తోందని నిపుణులు చెబుతున్నారు.వ్యవసాయంలో డ్రోన్ల వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు గంటల సమయం పట్టే మందు పిచికారీ పనిని ఇప్పుడు కొన్ని నిమిషాల్లో పూర్తి చేస్తున్నారు. మందులు సమానంగా పంటపై పడటం వల్ల వృథా తగ్గుతోంది. రైతులు నేరుగా రసాయనాల మధ్య పనిచేయాల్సిన అవసరం తగ్గడంతో ఆరోగ్య సమస్యలు కూడా తగ్గుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేక కెమెరాల సహాయంతో పంటలకు ఎక్కడ నీరు అవసరమో, ఎక్కడ తెగుళు ప్రారంభమవుతున్నాయో ముందుగానే గుర్తించే సాంకేతికత కూడా అందుబాటులోకి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో రైతులు మొబైల్ యాప్‌ల



ద్వారా డ్రోన్ సేవలను బుక్ చేసుకునే విధానం ప్రారంభమైంది. క్యాబ్ సేవల మాదిరిగా అవసరమైన సమయంలో డ్రోన్ సేవలను రైతులు పొందుతున్నారు. చిన్న రైతులు కూడా తక్కువ ఖర్చుతో ఆధునిక సాంకేతికతను వినియోగించుకునే అవకాశం కలుగుతోంది. అయితే డ్రోన్ల ధరలు ఎక్కువగా ఉండటం, శిక్షణ అవసరం, బ్యాటరీ పరిమితులు, గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక అవగాహన తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భారత రైతాంగానికి కొత్త దారిని చూపిస్తోంది. శ్రమ తగ్గించి, ఖర్చు తగ్గించి, అధిక దిగుబడులు సాధించే దిశగా ఈ సాంకేతికత కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం మరింత ప్రోత్సాహకాలు అందించి, గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణ పెంచితే భవిష్యత్తులో ప్రతి గ్రామంలో డ్రోన్లు వ్యవసాయంలో సాధారణ దృశ్యంగా మారే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కాంగ్రెస్‌పై కేటీఆర్ విమర్శలు



**-ప్రీపెయిడ్ మీటర్లపై ఆగ్రహం**

**-ఉచిత విద్యుత్తు రద్దు కుట్ర అంటూ ఆరోపణలు**

**-అంబర్‌పేట సమావేశంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు**

హైదరాబాద్, మే 24 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ మీటర్లు తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అంబర్‌పేటలో జరిగిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం ద్వారా రైతులకు అందుతున్న ఉచిత విద్యుత్తును రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజా వ్యతిరేకమని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంట్లో ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించి ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, వ్యవసాయ రంగం అన్న తేడా లేకుండా అందరికీ ప్రీపెయిడ్ మీటర్లు తీసుకురావాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రీపెయిడ్ మీటర్ల వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రజలపై భారీ ఆర్థిక భారం పడుతుందని కేటీఆర్ అన్నారు. ఉచిత కరెంట్‌ను పూర్తిగా తొలగించేందుకు ఇదే మొదటి అడుగని విమర్శించారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒత్తిడి చేసినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రీపెయిడ్ మీటర్లను అంగీకరించలేదని గుర్తుచేశారు. రూ.30 వేల కోట్ల రుణం నిలిపివేసినా కేసీఆర్ వెనక్కి తగ్గలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి ప్రైవేట్ సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పగించాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయాలు తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ కరెంటు కుట్రలను అర్థం చేసుకుని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మోటార్లకు మీటర్లు రాకముందే, ప్రతి ఇంట్లో ప్రీపెయిడ్ మీటర్లు అమర్చకముందే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు రాజకీయంగా గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర అభివృద్ధి, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ వంటి అంశాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ నగరాన్ని సక్రమంగా నిర్వహించలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో భారీ స్థాయిలో అవినీతి జరిగే అవకాశముందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎస్టీపీల నిర్మాణం, ఇతర పనులు ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. పార్టీ బలోపేతం కోసం త్వరలో సభ్యత్వ నమోదు అనంతరం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి మందికి పైగా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల పాలనలో ప్రజలకు చేసిన అన్యాయాలు, ఇచ్చిన హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై పోరాటం చేసిన వారికే పార్టీ టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు.

## తెలంగాణ మంత్రిని కలిసిన తమిళనాడు మంత్రి విశ్వనాథన్

**-మర్యాదపూర్వక భేటీతో ఇరు రాష్ట్రాల సాన్నిహిత్యం**

**-శాలువా, మొక్కతో ఘన సత్కారం**

**-అభివృద్ధి అంశాలపై చర్చించిన మంత్రులు**



హైదరాబాద్, మే 24 (మన ప్రజాప్రతినిధి): తమిళనాడు ఉన్నత విద్యాశాఖ మంత్రి పీ. విశ్వనాథన్ ఆదివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో

2

## రైతు గోస యాత్ర ప్రారంభం

**-వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ కార్యక్రమం**

**-రేవంత్‌రెడ్డిపై రఘునందన్‌రావు విమర్శలు**

**-రైతులతో నేరుగా మాట్లాడతామన్న బీజేపీ**



2

## సంగారెడ్డిలో దారుణ హత్య



2

## తెలంగాణ మంత్రిని కలిసిన తమిళనాడు మంత్రి విశ్వనాథన్

మెదటి పేజీ తరువాయి



కొనసాగింది. ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నాయకులు ఒకే వేదికపై కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా పరస్పరం ఆత్మీయ అభినందనలు తెలియజేసుకుంటూ నాయకులు సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు సాగారు. తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన పీ. విశ్వనాథన్ ఇటీవల తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడంతో ఆయనకు వివిధ రాష్ట్రాల నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయన, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా కలవడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయాల్లో పరస్పర గౌరవం, స్నేహపూర్వక సంబంధాలకు ఈ భేటీ నిదర్శనంగా నిలిచిందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా మంత్రి విశ్వనాథన్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం మంత్రి పొంగులేటి కూడా విశ్వనాథన్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే పచ్చదనానికి ప్రతీకగా ఒక మొక్కను అందించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సత్కార కార్యక్రమం అక్కడి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆత్మీయంగా సాగింది. భేటీ సందర్భంగా ఇరు రాష్ట్రాల అభివృద్ధి, పరిపాలన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా విద్య, గృహ నిర్మాణం, రెవెన్యూ పరిపాలన వంటి రంగాల్లో చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని పరస్పరం అభినందించుకున్నారు. ఇటీవల దక్షిణ భారత రాష్ట్రాల మధ్య పరిపాలనా అనుభవాల మార్పిడి, అభివృద్ధి కార్యక్రమాలపై సమన్వయం పెరుగుతున్న తరుణంలో ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు పలు రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని నాయకులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాన్నిహిత్య సమావేశాలు కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సమావేశం ముగింపు సందర్భంగా ఇద్దరు నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రాజకీయ హోదాలకు అతీతంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగడం ప్రజలకు మంచి సందేశాన్ని ఇస్తుందని అక్కడి నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతూ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## రైతు గోస యాత్ర ప్రారంభం

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, మే 24 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రేపటి నుంచి "రైతు గోస – బీజేపీ భరోసా" పేరుతో ప్రత్యేక యాత్ర చేపట్టనున్నట్లు బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు వెల్లడించారు. ఈ యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ రైతుల సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. బీజేపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలను ప్రత్యక్షంగా పరిశీలించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తోందని రఘునందన్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో ఎనభై శాతం ధాన్యం కొనుగోలు జరిగిందని ప్రభుత్వం చెబుతోందని, అయితే నిజంగా ఆ స్థాయిలో కొనుగోళు ఎక్కడ జరిగాయో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన నివేదికలను మాత్రమే నమ్మి ప్రజలకు తప్పుదారి పట్టించే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఏదైనా జిల్లాకు వెళ్లి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో మాట్లాడితే అసలు పరిస్థితులు తెలుస్తాయని రఘునందన్‌రావు సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి తెలియడం లేదన్నారు. వడ్ల కొనుగోళ్లలో ఆలస్యం, తేమ శాతం పేరుతో ఇబ్బందులు, చెల్లింపుల జాప్యం వంటి సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ యాత్రలో రైతులతో నేరుగా మాట్లాడించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బయటపెడతామని ఆయన తెలిపారు. తమ ఉద్దేశ్యం రాజకీయాలు చేయడం కాదని, రైతుల సంక్షేమం కోసం పోరాడటమే లక్ష్యమని స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని రఘునందన్‌రావు విమర్శించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను కాలయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం నిజమైన చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఈ యాత్రలో పాల్గొని రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్తాయని రఘునందన్‌రావు తెలిపారు. అన్నదాతల పక్షాన బీజేపీ ఎల్లప్పుడూ నిలుస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## సంగారెడ్డిలో దారుణ హత్య

### -భర్తను హతమార్చిన భార్య
### -జేసీబీతో గొయ్యి తీసి పూడ్చివేత
### -తొమ్మిది రోజుల తర్వాత వెలుగులోకి నిజం



సంగారెడ్డి, మే 24 (మనప్రజాప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో సంచలనం రేపిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా మారుతున్నాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన నారాయణఖేడ్ మండలం గంగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. అనంతరం మృతదేహాన్ని జేసీబీ సహాయంతో గొయ్యి తవ్వించి పూడ్చిపెట్టిన విషయం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముత్యం రెడ్డి తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అయితే అతని భార్యకు గ్రామానికే చెందిన చింటుతో వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఈ విషయం కుటుంబంలో తరచూ గొడవలకు దారితీస్తుండేదని స్థానికులు చెబుతున్నారు. భర్త తమ సంబంధానికి అడ్డుగా మారుతున్నాడని భావించిన ఆమె, ప్రియుడితో కలిసి అతడిని హత్య చేయాలని పథకం వేసినట్లు పోలీసులు వెల్లడించారు. పథకం ప్రకారం ఇద్దరూ కలిసి ముత్యం రెడ్డిని హతమార్చిన అనంతరం నేరాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించారు. జేసీబీ సహాయంతో గొయ్యి తవ్వించి మృతదేహాన్ని అక్కడే పూడ్చిపెట్టినట్లు విచారణలో తేలింది. తర్వాత భర్త కనిపించడం లేదంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మొదట్లో కనిపించకుండా పోయిన కేసుగా భావించిన పోలీసులు అనుమానాస్పద పరిస్థితులను గమనించి విచారణను ముమ్మరం చేశారు. భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. ఘటన జరిగిన తొమ్మిది రోజుల తర్వాత నిందితులు నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో గంగాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివాహేతర సంబంధాల కారణంగా కుటుంబాలు నాశనం అవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిందితులైన భార్య, ఆమె ప్రియుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, కేసులో అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## బెంగళూరులో కిషన్‌రెడ్డి సమీక్ష

### -గనుల సంస్థల అధికారులతో కీలక సమావేశం
### -ప్రాజెక్టుల పురోగతిపై చర్చ
### -సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



బెంగళూరు, మే 24 (మనప్రజాప్రతినిధి): కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం బెంగళూరులో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. భారత భూగర్భ సర్వే సంస్థ, జాతీయ రాక్ మెకానిక్స్ సంస్థ, భారత గనుల బ్యూరో, భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులతో కలిసి వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న గనుల అన్వేషణ కార్యక్రమాలపై సమావేశంలో విస్తృత స్థాయిలో సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న అన్వేషణ పనుల పరిస్థితి, వాటి అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, పరిపాలనా



ఆటంకాలపై అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టులు వేగంగా పూర్తికావడానికి అవసరమైన చర్యలపై కూడా చర్చించారు. అనుమతుల ఆలస్యం, సాంకేతిక సవాళ్లు వంటి అంశాలు పనుల పురోగతిని ప్రభావితం చేస్తున్నాయని అధికారులు వెల్లడించారు. భారత భూగర్భ సర్వే సంస్థ చేపడుతున్న ఖనిజాల అన్వేషణ కార్యక్రమాలపై మంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా వివరాలు తెలుసుకున్నారు. జాతీయ రాక్ మెకానిక్స్ సంస్థ నిర్వహిస్తున్న పరిశోధనలు, గనుల భద్రతకు సంబంధించిన అధ్యయనాలపై కూడా సమీక్ష నిర్వహించారు. అలాగే భారత గనుల బ్యూరో ఆధ్వర్యంలో అమలవుతున్న పర్యవేక్షణ చర్యలపై అధికారులతో చర్చించారు. భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ చేపడుతున్న ప్రాజెక్టుల పరిస్థితిని కూడా మంత్రి సమీక్షించారు. గనుల రంగం దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్న ఆయన, ఖనిజ వనరుల సమర్థ వినియోగానికి ఆధునిక సాంకేతికత అవసరమని సూచించారు. అన్వేషణ కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలంటే సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో భద్రతా ప్రమాణాల అమలు అంశంపై కూడా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. గనుల అన్వేషణ, తవ్వకాల కార్యక్రమాల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశం ముగింపులో దేశ గనుల రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులు ప్రజలకు ఉపయోగపడేలా పారదర్శకంగా అమలు కావాలని తెలిపారు. గనుల రంగ అభివృద్ధి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## తమిళనాడులో ఉచిత విద్యుత్ విస్తరణ



చెన్నై, మే 24 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు రాష్ట్రంలోని గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఉచిత విద్యుత్ పథకాన్ని మరింత విస్తరిస్తూ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానం వల్ల రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు పూర్తిగా సున్నాగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రిగా సి. జోసెఫ్ విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి కీలక సంక్షేమ నిర్ణయంగా దీనిని భావిస్తున్నారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై పెరుగుతున్న ఖర్చుల భారాన్ని తగ్గించడమే ఈ పథకం లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ నిర్ణయంతో లక్షలాది కుటుంబాలకు ప్రతి రెండు నెలలకు గణనీయమైన ఆదా కలగనుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి అంశాల్లో మార్పులు చేస్తున్నట్లు సంస్థ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం.. రెండు నెలలకు 500 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 100 యూనిట్లలోపు వినియోగించే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు ప్రయోజనం పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య 1.2 కోట్ల కుటుంబాలకు పెరగనుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మరో 85.83 లక్షల మంది వినియోగదారుల విద్యుత్ బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ.235 వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే 500 యూనిట్లకు మించి వినియోగించే 34.24 లక్షల కుటుంబాలకు మాత్రం పాత విధానంలో ఉన్న 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగనుంది. ఈ పథకం వల్ల ఏర్పడే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. మే 10న ప్రభుత్వం ఈ నిర్ణయం ప్రకటించగానే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రజల జీవన వ్యయాన్ని తగ్గిస్తూ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌పై ఉదయనిధి ఫైర్

### -వెన్నుపోటు పొడిచిన పార్టీని నమ్మొద్దు
### -విజయ్ ప్రభుత్వానికి మద్దతుపై డీఎంకే ఆగ్రహం

3



# కాంగ్రెస్‌పై ఉదయనిధి ఫైర్



తరువాయి భాగం

చెన్నై, మే 24 (మనప్రజాప్రతినిధి): సీఎం విజయ్ మైనారిటీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వడంపై తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికార ఆశతో డీఎంకేను నమ్మించి వెన్నుపోటు పొడిచిందంటూ కాంగ్రెస్ నాయకత్వంపై మండిపడ్డారు. డీఎంకే కార్యకర్తలు ఇకపై కాంగ్రెస్‌ను నమ్మొద్దని, వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దని పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తల మద్దతు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నాయకత్వం వల్లే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని ఉదయనిధి అన్నారు. ప్రజలు స్టాలిన్ మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకున్నందుకే కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వచ్చాయని తెలిపారు. కానీ ఇప్పుడు కొన్ని పదవుల కోసం తమకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోవడం రాజకీయ ద్రోహమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ప్రజలు కాంగ్రెస్ తీరును గమనిస్తున్నారని, అతి త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని ఉదయనిధి పేర్కొన్నారు. ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలవడానికి డీఎంకే కార్యకర్తల కృషే కారణమని గుర్తుచేశారు. రాజకీయాల్లో కృతజ్ఞత, మర్యాద ఉండాలని, కానీ కాంగ్రెస్ నాయకుల్లో అవి కనిపించడం లేదని విమర్శించారు.దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఎదుగుదలకు కూడా కాంగ్రెస్ విధానాలే కారణమని ఉదయనిధి ఆరోపించారు. ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వల్లే కాంగ్రెస్ ఓడిపోతుందని భావించామని, కానీ ఇప్పుడు చూస్తుంటే కాంగ్రెస్ మోసపూరిత రాజకీయాలే ప్రజలను దూరం చేస్తున్నాయని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన స్థానాలు కూడా స్టాలిన్ నాయకత్వం వల్లే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. జెన్ జెడ్ యువత రాజకీయాలపై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని ఉదయనిధి సూచించారు. తొలిసారి ఓటు వేసే యువతకు రాజకీయ చైతన్యం కల్పించడం చాలా అవసరమన్నారు. డీఎంకే యువజన విభాగం నేతలు గ్రామస్థాయిలో యువతతో కలసి పనిచేయాలని, ప్రజలకు నిజమైన రాజకీయ పరిస్థితులను వివరించాలని పిలుపునిచ్చారు. తమిళనాడులో కాంగ్రెస్ తీసుకున్న తాజా నిర్ణయం రానున్న రోజుల్లో రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. డీఎంకే–కాంగ్రెస్ మధ్య విభేదాలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.

# హైదరాబాదుకు కొత్త పారిశ్రామిక విధానం

**-హెచ్ఐఎల్‌టీపీ ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం**
**-కాలుష్య పరిశ్రమల తరలింపుకు చర్యలు**
**-స్వచ్ఛ నగరంగా మార్చడమే లక్ష్యం**



హైదరాబాద్, మే 24 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం సచివాలయంలో హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. నగర అభివృద్ధికి అనుగుణంగా పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ చేపట్టేందుకు ఈ విధానం కీలకంగా మారనుంది. ముఖ్యంగా హైదరాబాద్ ప్రధాన పట్టణ ప్రాంతంలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను దశలవారీగా తరలించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే ఈ విధానం ప్రధాన లక్ష్యమని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. వేగంగా విస్తరిస్తున్న నగర పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పరిశ్రమల పునర్వ్యవస్థీకరణ అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు.హెచ్ఐఎల్‌టీపీ విధానం ద్వారా పరిశ్రమల తరలింపు ప్రక్రియను పారదర్శకంగా, పరిశ్రమలకు అనుకూలంగా అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. పరిశ్రమల యజమానులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు





చెప్పారు. ఈ విధానం ద్వారా పరిశ్రమలకు స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నగర కేంద్ర ప్రాంతాల్లో ఉన్న కాలుష్యకారక పరిశ్రమల వల్ల పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతోందని అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యం, నీటి కాలుష్యం వంటి సమస్యలను తగ్గించేందుకు పరిశ్రమలను నగర పరిధి బయటకు తరలించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు.హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంలో ఈ విధానం కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. పరిశ్రమల తరలింపుతో పాటు కొత్త పారిశ్రామిక మండలాల అభివృద్ధి, ఆధునిక మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. నగరంలో జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి ఈ చర్యలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత హైదరాబాద్‌ను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పరిశ్రమల అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, నగర సుస్థిర అభివృద్ధి దృష్ట్యా ఈ విధానం కీలక నిర్ణయంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను.... ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలి



జర్నలిస్టుల పరిస్థితి మహిళల కంటే హీనంగా మారింది: మన ప్రజాప్రతినిధి తేదీ24/5/2026 ఆదివారం తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితి మహిళల కంటే హీనంగా మారిందని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు కళాశ్రీ ప్రవీణ్ విమర్శించారు. సూర్యాపేటలో జర్నలిస్టులతో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మహాలక్ష్మి పథకం పేరిట రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆధార్ కార్డు ఆధారంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, జర్నలిస్టుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కొత్త అక్రిడేషన్ కార్డులు, బస్సు పాస్ సౌకర్యాల కల్పనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.జర్నలిస్టు ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న అక్రిడేషన్ కమిటీ సభ్యులు, వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సు సర్వీసుల్లో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని కోరారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం జర్నలిస్టులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లే జర్నలిస్టులకే ఇన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు

# పింఛన్ కోసం అత్తను వీపుపై మోసిన కోడలు

**-9 కిలోమీటర్లు అడవులు దాటి బ్యాంకుకు ప్రయాణం**
**-వైరల్ వీడియోతో ప్రభుత్వ వ్యవస్థలపై విమర్శలు**



ఛత్తీస్‌గఢ్, మే 24 (మనప్రజాప్రతినిధి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతంలో చోటుచేసుకున్న ఓ ఘటన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై తీవ్ర చర్చకు దారితీసింది. 90 ఏళ్ల వృద్ధురాలిని ఆమె కోడలు తన వీపుపై మోసుకుంటూ అడవులు, రాతిబాటలు, వాగులు దాటుకుంటూ కిలోమీటర్ల దూరం నడిచిన దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటన ప్రజలను భావోద్వేగానికి గురి చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను మరోసారి బయటపెట్టింది. సర్గుజా జిల్లా పరిధిలోని మైన్‌పాట్ ప్రాంతానికి చెందిన సుఖ్మానియా బాయి అనే మహిళ తన 90 ఏళ్ల అత్తకు పింఛన్ డబ్బులు ఇప్పించేందుకు ఆమెను వీపుపై మోస్తూ దాదాపు 9 కిలోమీటర్ల దూరంలోని బ్యాంకుకు తీసుకెళ్లింది. ఆ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇప్పటికీ కాలినడకనే ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్ డబ్బులు పొందాలంటే లబ్ధిదారులు స్వయంగా బ్యాంకుకు వెళ్లి వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగానే గత కొన్ని నెలలుగా సుఖ్మానియా బాయి తన అత్తను ఇలాగే మోసుకుంటూ బ్యాంకుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. మండుటెండలో అడవులు, వాగులు దాటుకుంటూ ఆమె పడుతున్న శ్రమ స్థానికులను కలచివేసింది.వీడియో చిత్రీకరిస్తున్న వ్యక్తి.. “ఇంత కష్టపడి ఎందుకు మోసుకెళు న్నావు?” అని అడగగా సుఖ్మానియా బాయి తన ఆవేదనను వ్యక్తం చేసింది. “బ్యాంకుకు స్వయంగా తీసుకెళ్తేనే పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. ప్రతి నెల రూ.1500 కోసం ఈ కష్టం పడాల్సి వస్తోంది” అని ఆమె తెలిపింది. గతంలో పింఛన్ డబ్బులు గ్రామంలోనే అందేవని, ఇప్పుడు మాత్రం బ్యాంకుకు వెళ్లక తప్పడం లేదని పేర్కొంది. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు ప్రభుత్వ వ్యవస్థలపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. డిజిటల్ ఇండియా, ఇంటివద్దకే సేవలు అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో కనీస సంక్షేమ పథకాల లబ్ధి పొందడమే ప్రజలకు భారంగా మారిందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటన గ్రామీణ భారతదేశంలో ఇప్పటికీ కొనసాగుతున్న రవాణా సమస్యలు, డిజిటల్ సేవల లోపాలు, పేదల ఇబ్బందులను స్పష్టంగా చూపిస్తోందని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. వృద్ధులు, వికలాంగులు, గిరిజన ప్రాంతాల ప్రజలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు

# రెడ్డిపల్లిలో విషాదం.... గంట వ్యవధిలో వదిన, మరదళ్ల మృతి





మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 24: చేగుంట మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది.నెలలోపు బాలింతలైన వదిన,మరదర్లు వరుసగా మృతి చెందడంతో గ్రామం లో తీవ్ర విషాదనాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన కర్నన్న స్వాతి (26)ప్రసవం .అనంతరం తన తల్లిగారిల్లు అహిన చిన్న శంకరంపేట్ మండలం చందంపేట గ్రామం లో ఉంది, స్వాతి కి నేలాలోపు పసికందు కుమార్తె ఉండగా , శుక్రవారం రాత్రి ఆమె అకస్మాత్తుగా అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు అమెను మెదక్ ఆసుపత్రికి తరలించరు,చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు, అనంతరం స్వాతి మృతదేహాన్ని అత్తగారిల్లు అయిన చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామానికి తీసుకొని వచ్చారు,ఇదే సమయంలో స్వాతికి వరుసకి మరదలు అయిన కర్తన్న సౌందర్య(27) కూడా అనుకోకుండా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. నెలలోపు బాలింత అయిన సౌందర్యను కుటుంబ సభ్యులు వేంటనే నార్సింగ్ ఆసుపత్రి కి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ తెలిపారు,సౌందర్యకు నెలలోపు పసికందు కుమారుడు ఉన్నాడు. ఆమె అత్తగారిల్లు వీరారెడ్డిపల్లి కాగా, ప్రసవానంతరం ప్రస్తుతం రెడ్డిపల్లిలోనే ఉంటోంది. ఒకే కుటుంబనికి చెందిన వదిన,మరదర్లు గంటల వ్యపధిలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలోనూ విషాద వాతావరణం నెలకొంది.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ చేగుంట మే 24: చేగుంట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట 2007 -08 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం చేగుంట మండలంలోని వడియారం లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు 18 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు బాలకృష్ణ, గర్దాస్ మనోహర్ రావు, చల్లా లక్ష్మణ్, రాజేశ్వరి,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చేగుంట లో సబ్సిడీ పై జీలుగ విత్తనాలు మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్

మన ప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 24:చేగుంట మండలంలో సబ్సిడీపై, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ తెలిపారు.సోమవారం నుండి వీటి పంపిణీ ప్రారంభమవుతుందన్నారు.30 కిలోల బస్తా ధర రూ.2,453 కాగా, ఇది 2.5 ఎకరాలకు సరిపోతుంది. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్,పట్టాదారు పాస్ బుక్,జిరాక్స్ ప్రతులతో మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.



# కుమ్మరి నీల ప్రథమ వర్ధంతి నివాళులర్పించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట/నార్సింగి ,మే 24 :మెదక్ జిల్లా, నార్సింగి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు మైలారం బాబు వదిన కుమ్మరి నీల ప్రథమ వర్ధంతి సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# రైతు ప్రభుత్వం గా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది

**-పలు గ్రామాలలోని సెంటర్లో ఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలి**

**-వర్షాలు కురిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

**-రైతులు మానసిక ఆందోళన చెందుతున్నారు**

**-ఇల్లంతకుంట బిజెపి మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్**



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 24 మే:ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల, ఇల్లంతకుంట, జంగం రెడ్డిపల్లి, అనంతారం, పెద్ద లింగాపూర్, చిక్కుడువానిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు భూమల్ల అనిల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.రైతులు పలు రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్వరలో వర్షాలు పడే అవకాశం ఉండటంతో ధాన్యం తడిసిపోయి, నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన వరి ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండకుండా తగిన సిబ్బంది, రవాణా వాహనాలు ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పండుగ లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి పినికాస్ అనిల్, వార్డ్ సభ్యులు నాయిని శ్రీనివాస్, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిలపల్లి వరుస చోరీల కేసులను ఛేదించిన మెదక్ పోలీసులు

**-కోటి ముప్పై ఐదు లక్షల విలువైన బంగారం, వెండి వస్తువుల రికవరీ**

**-విలువైన బంగారాన్ని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలి**


**-విశేషంగా కృషి చేసిన పోలీసు బృందాలకు రివార్డులు**

**-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్**






మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మే 25,:మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం చిలపల్లి గ్రామంలో వరుసగా జరిగిన చోరీల కేసులను మెదక్ జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేశారని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. దొంగిలించబడిన భారీ మొత్తంలో బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడిస్తూ...ఈ నెల 14వ తేదీ రాత్రి గ్రామంలోని తాళం వేసిన ఐదు ఇండ్లను లక్ష్యంగా చేసుకున్న దుండగులు తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. సుమారు 109 తులాలు 9 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండున్నర కిలోల వెండి వస్తువులు, రూ.19 వేల నగదు అపహరించారు. మరో ఇంట్లో మూడు తులాల బంగారం దొంగిలించారు. ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి రామాయంపేట సమీపంలో చాకచక్యంగా పట్టుకున్నారు.




నిందితుల వద్ద నుంచి 929.7 గ్రాముల బంగారం, 1.7 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు జాదవ్ జైరాం నాయక్ అలియాస్ జెమ్లా నాయక్‌పై ఇప్పటికే పలు జిల్లాల్లో అనేక చోరీ కేసులు ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. శంకరంపేట-ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు కేసులతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో జరిగిన మరో 12 కేసులను కూడా నిందితుడు ఒప్పుకున్నాడు. మొత్తం 17 కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఎస్పీ తెలిపారు.నిందితులను వేగంగా పట్టుకున్నందుకు బాధితులు రాములు, మాణిక్ రెడ్డి జిల్లా ఎస్పీతో పాటు కేసు దర్యాప్తు చేసిన పోలీసు సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బాధితుడు రాములు మాట్లాడుతూ తమ బంగారం మళ్లీ దొరుకుతుందని ఆశించలేదని, దొంగతనం జరిగినప్పటి నుంచి పోలీసులు అండగా నిలిచి ధైర్యం చెప్పారని తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి కేసును ఛేదించిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో విశేషంగా కృషి చేసిన ఐదు ప్రత్యేక బృందాల సిబ్బందికి రివార్డులు, నగదు పురస్కారాలు అందజేశారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన బంగారాన్ని బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని అవగాహన కల్పించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐలు రేణుక రెడ్డి, జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐలు శంకర్, ప్రవీణ్ రెడ్డి, పోచయ్య, సీసీఎస్ బృందం, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డివివో గా పదోన్నతి పొందిన శ్రీనివాస్ గౌడ్ కు ఘన సన్మానం



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 24 మే :ఇల్లంతకుంట మండలంలో గతంలో ఎంపిడిఓ గా విధులు నిర్వర్తించిన గున్నాల శ్రీనివాస్ గౌడ్ డివివో గా సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా ఆదివారం వల్లంపట్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక సిడిపివో నాయిని ఎల్లయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ్,సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్,మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్,కట్ట నర్సింహా రెడ్డి,నాయిని ధర్మయ్య, నాయిని రమేష్, నేరెళ్ల శ్రీనివాస్,నాయిని మల్లేశం, పులి మల్లేశం,కీసరి రవి,నేరెళ్ల రాజు కాసారపు పర్శరాములు, నాయిని మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నేరేడుచర్ల (మనప్రజా ప్రతి నిధి దినపత్రిక ):నేరేడుచర్ల వాసవి క్లబ్ వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే చలివేంద్రం దగ్గర బాటసారులకు చల్లనిమజ్జిగ పెరుగన్నం చల్లని మంచినీరు 3 వరోజు కూడా ఘనంగా నిర్వహించినారు. దాదాపు బాటసారులకు 2000 మందికి మజ్జిగ పంపిణీ చేయనైనది .కావున ఈ కార్యక్రమానికి దాతలుగా పోలిశెట్టి వెంకటేశ్వర్లు రేణుక మరియు వారి కుమారులు వంశీ అజయ్. మరియు ఓరుగంటి గణేష్ అనురాధ దంపతులు.ఇట్టి కార్యక్రమానికి పాల్గొన్నవారు వాసవి క్లబ్ సెక్రటరీ చేరుకు రాము ట్రెజరర్ చారాగుండ్ల వెంకటేశ్వర్లు .మరియు వాసవిక్లబ్ జిల్లా మాజీ ఆఫీసర్స్ రాచకొండ శ్రీనివాసరావు .కొత్త లక్ష్మణ్. ఊట్కూరు నటరాజ్ .కంది బండ శ్రీనివాసరావు.మురారిశెట్టి రమేష్. వనితక్లబ్ ప్రెసిడెంట్ చారాగుండ్ల మల్లిక .సెక్రటరీ రేపాల ఊర్మిళ. ట్రెజరర్ జగిని శ్రీవాణి. మరియు క్లబ్ సభ్యులు ఉప్పల పుల్లయ్య. గుంటూరు శ్రీనివాస్. తాలూరి శ్రీనివాస్ .అనంతల సత్యనారాయణ. తడకమళ్ళ పరమేశం. రేపాల మహంత్ సాయి.పాల వాయిగోపాల్ కృష్ణ. నోముల రామారావు. చందా కిషన్. పాల్గొన్నారు.

# ఉల్లాస భరితంగా... వేసవిశిక్షణ శిబిరం

నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ) పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేసవి శిబిరం నందు ప్రత్యేక ఆకర్షణగా డాన్స్ మాస్టర్ రాజు నృత్య శిక్షణ కొనసాగడం ఆనందదాయకమని ప్రధానోపాధ్యాయులు బట్టు మధు అన్నారు విద్యార్థినీ విద్యార్థులు రాజు మాస్టర్ నేర్పించిన హుషారైన స్టెప్స్ ను అంతే హుషారుగా నేర్చుకున్నారని ఇట్టి నృత్య శిక్షణ విద్యార్థుల శారీరక మానసిక వికాసానికి మరీ ముఖ్యంగా గ్రాహణ ధారణ సామర్థ్యం పెంపొందుతుందన్నారు డాన్స్ మాస్టర్ రాజు నేరేడుచర్లలో నృత్య శిక్షణ కేంద్ర నిర్వహణ ద్వారా విద్యార్థులను యువతను నృత్యంలో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు ఈ సందర్భంగా రాజు మాస్టర్ ని ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం జానకి రాములు ఎన్ నరసింహారావు కె వెంకటేశ్వరరావు లాల్ సాహెబ్ సరిత పాల్గొన్నారు



# అరకొరగా కాకుండా అర్హులందరికీ కొత్తగా ఆసరా పెన్షన్లు ఇవ్వాలి



నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )అసెంబ్లీ ఎన్నికల ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విదంగా తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన అందరికీ ఆసరా పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఈరోజు గరిడేపల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయి మూడో సంవత్సరం లోకి అడిగిడినా నేటికి తాను ఇచ్చిన హామీని అమలు చేయలేదని, కొత్తగా నేటికీ ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వలేదని,ఇప్పుడు కొత్త పెన్షన్స్ ఇస్తామని హడావిడి చేస్తూ, అర్హులైన అందరికీ కాకుండా కొందరికే, రాష్ట్రం మొత్తం కొత్తగా రెండు లక్షల మందికే ఇస్తామనటం కరెక్ట్ కాదని, అర్హులైన అందరికి పెన్షన్లు ఇచ్చి ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ ని ఆయన కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే, వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలకు, ఇచ్చే పెన్షన్లు గతంలో ఇస్తున్న రెండు వేల రూపాయలు కాకుండా,4000 రూపాయలు ఇస్తామని, వికలాంగులకు గతంలో ఇస్తున్న నాలుగు వేలకు బదులు 6000 రూపాయలు ఇస్తామని చెప్పి, అధికారం లోకి వచ్చి మూడో సంవత్సరం నడుస్తున్నా,నేటికీ అమలు చేయలేదని, మరియు ప్రభుత్వం అర్హులైన వారికి కొత్తగా పెన్షన్లు ఇవ్వలేదని ఆయన అన్నారు.,కొత్తగా పెన్షన్లు ఇవ్వకుండా, అలాగే పాత పెన్షన్ దారులకు పెంచి ఇస్తామన్న పైసలను ఇవ్వకుండా జాప్యం చేయటం ప్రభుత్వ పెద్దలకు తగదని ఆయన అన్నారు.. ప్రజలను అయోమయానికి గురి చేయకుండా అర్హులందరికి పెన్షన్లు ఇస్తున్నామన్నట్టుగా ప్రకటించి, ప్రజలలో నెలకొన్న గందరగోళాన్ని నివారించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# కొలనూరులో ఘోర అగ్నిప్రమాదం



మనప్రజాప్రతినిది/రాజన్నసిరిసిల్లమే,24:బూడిదైన 30 ఏళ్ల మామిడి తోట..కన్నీరుమున్నీరవుతున్న రైతు!చేతికొచ్చిన పంట కళ్లముందే బూడిదైపోవడంతో ఒక రైతుకు తీరని గుండెకోత మిగిలింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలో ఆదివారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు దుద్దేటి రాములుకు చెందిన మామిడి తోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది.కళ్లముందే కాలిపోయిన 30 ఏళ్ల శ్రమబాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30 సంవత్సరాలుగా ఎంతో నమ్మకంగా, ప్రాణప్రదంగా పెంచిన పెద్ద మామిడి చెట్లు ఈ ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. ప్రస్తుతం చెట్లన్నీ కాయలతో కళకళలాడుతూ కంటికి కనిపిస్తున్న తరుణంలో ఈ ప్రమాదం జరగింది దాదాపు 100 మామిడి చెట్లు కాయలతో సహా పూర్తిగా దగ్ధమయ్యాయి.అగ్నిప్రమాద తీవ్రతకు తోటలోని మామిడి చెట్లతో పాటు, వాటికి నీరందించే వాటర్ పైప్‌లైన్లు, డ్రిప్ పైపులు, మొత్తం డ్రిప్ సిస్టం పూర్తిగా కాలిపోయాయి. దీంతో సుమారు 8 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు రాములు కన్నీటిపర్యంతమయ్యారు."పొలాల్లో పంట కోతల అనంతరం కొందరు బాధ్యతారాహిత్యంగా కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. ఆ మంటలు వ్యాపించే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. దయచేసి ఎవరూ కూడా చేలల్లో కొయ్యలు అంటబెట్టి మాలాంటి రైతుల జీవితాలను ఆగం చేయకండి" అని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి రైతు వేడుకోలుఈ ప్రమాదానికి కారకులైన వారిపై అధికారులు విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, సర్వస్వం కోల్పోయిన తనకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

# డివివోగా పదోన్నతి పొందిన మాజీ ఎంపీడీఓకు ఘన సన్మానం
## సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా గున్నాల శ్రీనివాస్ గౌడ్ బాధ్యతల స్వీకరణ



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల మే ,24: ఇల్లంతకుంట మండలంలో గతంలో ఎంపీడీఓగా సేవలందించి, ప్రజాదరణ పొందిన గున్నాల శ్రీనివాస్ గౌడ్ జిల్లా విజిలెన్స్ అధికారి (డివివో)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన సిద్దిపేట జిల్లా విజిలెన్స్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.శ్రీనివాస్ గౌడ్ ఉన్నత పదవిని చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఆదివారం వల్లాంపట్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ముఖ్యులు శ్రీనివాస్ గౌడ్‌కు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. శ్రీనివాస్ గౌడ్ తన విధి నిర్వహణలో ఎల్లప్పుడూ నిబద్ధతతో, ప్రజా పక్షపాతిగా పనిచేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో దుబ్బాక సిడిపివో నాయిని ఎల్లయ్య, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జెల రాజశేఖర్ గౌడ్, సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్, కట్ట నర్సింహా రెడ్డి, నాయిని ధర్మయ్య, నాయిని రమేష్, నేరెళ్ల శ్రీనివాస్, నాయిని మల్లేశం, పులి మల్లేశం, కీసరి రవి, నేరెళ్ల రాజు, కాసారపు పర్శరాములు, నాయిని మహేందర్ తదితరులు పాల్గొని శ్రీనివాస్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు.

# వృద్ధాశ్రమంలో నిత్యవసర వస్తువులు పంపిణీ



మన ప్రజా ప్రతినిధి తేదీ 24 5 2026 ఆదివారం రోజున దేవరపుల మండలం కడవెండి సీతారాంపురం గ్రామానికి చెందిన వృద్ధాశ్రమంలో అనాధలకు లయన్స్ క్లబ్ మొగుళ్ళ గిరి గౌడ్ మమత గార్ల వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాధలకు 50 కేజీల బియ్యం నిత్యవసర సరుకులు పండ్లు పాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గుండాల మురళీధర్ సెక్రటర్ రమేష్ నాయక్ మరియు కోశాధికారి బొడ్డు సుందర్ జలగం రామచంద్ర గౌడ్ చింతకింది మురళి లైన్స్ క్లబ్ సభ్యులు సీనియర్లు తదితరులు పాల్గొన్నారు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మన ప్రజాప్రతినిధి కొండపాక మండల్ :మార్పడగ గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వతరగతి 2010-2011, సంవత్సరనికి చెందిన విద్యార్థులు అందరూ ఒకే వేదిక మీద మళ్ళీ కలువడం జరిగింది. ఈసందర్భంగా వారు అందరూ ఆత్మీయగా ఒకరినొకరు పాలుకరిచుకొని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం జరిగింది. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ కలిసి ఉపాధ్యాయలను సన్మానీచడం జరిగింది.ఈ కార్యక్రమం లో 2010-2011 సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

